రైతులను వణికిస్తున్న తుఫాన్

ధాన్యం తరలింపును పరిశీలించిన అధికారులు

పెనమలూరు: పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రావడంతో రైతులు వణికిపోతున్నారు. మండల పరిధిలో దాదాపు 6వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చాలా వరకు కోతకు వచ్చిన సమయంలో తుఫాన్ రావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులు వర్షాలు రాకుండా ఉండి ఉంటే పంట మిల్లులకు చేరేదని రైతుల చెబుతున్నారు. అయితే అధికార యాంత్రాంగం చర్యలతో పలువురు రైతులు సకాలంలో ధాన్యం మిల్లులకు తరలించారు. మిల్లులకు వెళ్లని ధాన్యం తడవకుండా ఉండటానికి అధికారుల సూచన మేరకు రైతులు టార్పాన్ కప్పారు.

అధికారుల తనిఖీ...

తాడిగడప రైతుభరోసా కేంద్రాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) అధికారిణి శశికళ, సివిల్ సప్లయిస్ అధికారి నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు రైతుల వద్ద నుంచి ఎంత సేకరించింది, మిల్లులకు ఎంత పంపింది రికార్డులు పరిశీలించారు. ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు రైతులతో మాట్లాడుతూ తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు ధాన్యం....

హనుమాన్‌జంక్షన్ రూరల్: పొలాల్లోని ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని బాపులపాడు మండల ఏవో జొన్నలగడ్డ భవాని సోమవారం తెలిపారు. కల్లంలో ధాన్యమున్న రైతులు ఆర్బీకేలను సంప్రదిస్తే గన్నవరం మార్కెట్ యార్డులోని గోదాములకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.


తాడిగడపలో తనిఖీ చేస్తున్న ఎఫ్‌సీఐ అధికారిణి శశికళ, నాగిరెడ్డి

విజయవాడరూరల్‌లో....

విజయవాడరూరల్: తుఫాన్ నేపథ్యంలో మండల తహసీల్దార్ కె.లక్ష్మీ పలు గ్రామాల్లోని ఆర్బీకేలను సోమవారం తనిఖీ చేశారు. నున్న గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి గోనెసంచులు అందుబాటులో ఎన్ని వున్నాయి, తేమశాతం కొలిచే యంత్రం గురించి అడిగారు. ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి దగ్గరలోని రైస్‌మిల్లుకు పంపించాలన్నారు. పాతపాడు, గొల్లపూడి, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని ఆర్బీకేల్లో తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ ఉన్నారు.

వ్యవసాయ అధికారుల విస్తృత పర్యటన....

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.సునీల్, ఏవో ఎస్ఎల్ తేజస్వీ సోమవారం పర్యటించారు. వర్షంలో రైతాంగం తీసుకోవాల్సిన చర్యలపై పలు చోట్ల అవగాహన కల్పించారు. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ధాన్యంను వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌లకు తరలించాలని భావిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు.

రామవరప్పాడులో....

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ఎనికేపాడు పంటపొలాల్లో కల్లాల్లోని వరి ధాన్యాన్ని డెప్యూటీ కలెక్టర్, సివిల్ సప్‌లెయ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. కల్లాల్లోని ధాన్యాన్ని హుటాహుటిన మిల్లులకు తరలించే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అందుబాటులో ఉన్న ధాన్యం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. పంట వర్షానికి తడవకుండా గోదాముల్లో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూరల్ మండల తహసీల్దార్ లక్ష్మి ఎనికేపాడులోని రైస్ మిల్లును పరిశీలించి రైతులు మిల్లుకు తరలిస్తున్న ధాన్యాన్ని వెంటనే దించుకోవాలని ఆదేశించారు. సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎడీఏ బొడ్డపాటి వెంకటేశ్వరరావు, ఎఓ రంగనాథ్, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి గోపిరాజు తదితరులు కల్లాల్లో ధాన్యాన్ని పర్యవేక్షించి దగ్గరుండి మిల్లుకు తరలించారు.

ధాన్యం మిల్లులకు రవాణా....

విజయవాడరూరల్: రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు రవాణా చేయాలని ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు సూచించారు. విజయవాడ వ్యవసాయశాఖ ఏడీ బి.వెంకటేశ్వరావు, ఏవో రంగనాథ్‌బాబుతో కలిసి పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లాలో 3500 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆన్‌లైన్ లోనూ, మరో 400 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆఫ్‌లైన్లో కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 24 రైస్‌మిల్లులను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పంట పొలాలకు సంబంధించి ఎలాంటి నష్టం జరగలేదని, రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే రవాణా చేసి రైస్ మిల్లులకు పంపడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.


నున్న ఆర్బీకేని పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీ


ముస్తాబాదలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్, ఏవో తేజస్వీ


కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు


పరదాలతో కప్పిన ధాన్యం పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏడీ వెంకటేశ్వరావు, ఏవో రంగనాథ్

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచాలి

పెనమలూరు: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఏఐ ల్యాబ్, ఏటీపీఎల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి సాధించాలంటే అధ్యాపకులు కూడా తమ బోధనలో సామర్థ్యం పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే విధంగా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రముఖ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.కామరాజు, డాక్టర్ అవినాష్, డాక్టర్ జి.యోగేశ్వరరావు, డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ ఎస్.బాలాజీ, డాక్టర్ పి.హరికిషోర్, డాక్టర్ శుభకుమార్‌రెడ్డి, సూరియాబారిక్‌లు అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, డీన్‌లు రావి సత్యనారాయణ, సుధీర్‌బాబు, శ్రీకాంత్, వంశీకృష్ణ పాల్గొన్నారు.


ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్‌కుమార్ తదితరులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టిడ్కో డైరెక్టర్ రాఘవరావు

పెనమలూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి సచివాలయం-5లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాఘవరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. నవరత్నాలు పేదలకు వరాలు అని చెప్పారు. కుల మత, రాజకీయాలకు అతీతంగా చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. పోరంకి సచివాలయం-5 పరిధిలో ఇప్పటి వరకు రూ. 29.87 కోట్లు ఆర్థిక సాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జగనన్న జమ చేశారని పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని వెల్లడించారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు అంకెం రాజేష్, వీర్ల బుజ్జి, ముచ్చు నాగేంద్ర, చుండూరు శేఖర్ బాబు, చలమల ప్రసాద్, ఆకునూరు సుబ్బారావు, మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


పోరంకి సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న టిడ్కో డైరెక్టర్ రాఘవరావు

తాగునీటికి మైక్రో ఫిల్టర్ బెడ్స్ నిర్మాణం


మైక్రోఫిల్టర్స్ బెడ్స్ నమూనా


గ్రామంలో జరుగుతున్న ఫిల్టర్ బెడ్స్ పనులు

రూ. 20 లక్షలతో నిర్మాణం

విజయవాడరూరల్: నున్న గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ గ్రాంటు రూ. 20లక్షలతో నున్నలో మైక్రో ఫిల్టర్ బెడ్స్ నిర్మిస్తోంది. గతంలో ఉన్న ఫిల్టర్ బెడ్స్(ఇసుకతో) కాలక్రమంలో మరమ్మతులకు నోచుకోవడంతో జగనన్న ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా మైక్రోఫిల్టర్స్ బెడ్స్ నిర్మాణం చేస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఫిల్టర్‌మీడియా వల్ల స్వచ్ఛ మైన తాగునీరు లభ్యమవుతుందని గ్రామీణ నీటి సరఫరా విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దయానంద్ తెలియజేశారు. నున్న గ్రామ జనాభా తాగునీటి అవసరాలకు ప్రతి రోజూ మూడు లక్షల లీటర్లు అవసరం కాగా మైక్రో ఫిల్టర్స్ ద్వారా ప్రతి రోజూ 10లక్షల లీటర్ల నీరు లభ్యమవుతుందని డీఈ పేర్కొన్నారు. నీటిలో సహజంగా లభ్యమయ్యే న్యూట్రిషన్స్‌కు ఎలాంటి నష్టం లేకుండా యాక్టివ్ కార్బన్స్ నీటి వ్యర్థాలు, నాచు తొలగించి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తాయని చెప్పారు. మైక్రోఫిల్టర్ బెడ్స్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని క్వాలిటీ కంట్రోల్ నుంచి అనుమతులు కూడా వచ్చాయని వెల్లడించారు. మైక్రోఫిల్టర్స్ బెడ్స్ నిర్వహణ ఖర్చులు కూడా నామమాత్రమేనని సంవత్సరానికి కేవలం రూ. 50వేలతో ఫిల్టర్లను మార్చుకునే వీలుందని ఆయన వివరించారు.

స్వచ్ఛమైన తాగునీరు



గ్రామంలో మైక్రో ఫిల్టర్స్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడం జరుగుతుంది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– కాటూరి సరళ, నున్న గ్రామ సర్పంచి

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ డివిజన్ డెప్యూటీ ఈఈ బి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, విద్యుత్ లైన్లు తెగి పడిపోవడంతో సరఫరా నిల్చిపోయినట్‌లైతే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. బాపులపాడు, ఉంగుటూరు మండలాల విద్యుత్ ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే సంప్రదించేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ ఏఈ 9440812165, ఎల్ఐ 8985769124, వీరవల్లి ఏఈ 9491043480, ఎల్ఐ 8985769117, ఉంగుటూరు ఏఈ 9440812181, ఎల్ఐ 8985769206, తేలప్రోలు ఏఈ 9490156503, ఎల్ఐ 8985769108 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వినియోగదారులకు డెప్యూటీ ఈఈ శ్రీనివాసరావు సూచించారు.

మధుర స్వరాల శాల ఘంటసాల

విజయవాడకల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని జీఆర్‌కే సాహితీపీఠం వ్యవస్థాపకుడు గొళ్ల నారాయణరావు అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం ఘంటసాల 101 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సభలో నారాయణరావు మాట్లాడుతూ ఘంటసాల స్వరం భగవంతుడు తెలుగు వారికి ఇచ్చిన గొప్ప వరమని అన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి పెద బ్రహ్మం మాట్లాడుతూ ఏటా ఘంటసాల పేరుతో పురస్కారాలను ప్రదానం చేస్తునట్లు తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు, పాత్రికేయుడు కొల్లూరి వెంకట్, సయ్యద్ ఆలీ, గాయకుడు మంగరాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులు ఘంటసాల పాటలను ఆలపించారు. ప్రతినిధులు ఘంటసాల చిత్రపటానికి నివాళులు సమర్పించారు.


ఘంటసాల జయంతి సభలో నారాయణరావు, చంద్రశేఖర్, డేవిడ్‌రాజు

ప్రసాదంపాడులో వికసిత్ భారత్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-3లో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం, ప్రభుత్వ విజయాలకు సంబంధించిన లఘ చిత్రం ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం గరీబ్ కల్యాణ్ యోజన, ఆవాజ్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, పీఎం కిసాన్ వంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారం, భాగస్వామ్యంతో వివిధ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు దూరు రత్నం, సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

బాలల హక్కుల రక్షణపై సదస్సు


శిక్షణలో పాల్గొన్న అధికారులతో ఎన్ఐడీఎం సిబ్బంది

గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరులో ఉన్న ఎన్ఐడీఎం(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) సౌత్ క్యాంపస్‌లో అత్యవసర సమయాల్లో బాలల హక్కులు, పిల్లల రక్షణపై సదస్సు సోమవారం జరిగింది. పోలీస్, విద్య, స్వచ్ఛంద సంస్థలు, రెవెన్యూ, పిల్లల అభివృద్ధి డిపార్టుమెంట్‌కు చెందిన 48 మంది అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. సీనియర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కుమార్‌రాకా శిక్షణ ప్రారంభించారు. విపత్తుల సమయంలో పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులు, నష్టాలపై చర్చించారు. కార్యక్రమంలో అధికారులు రంజన్‌కుమార్, డాక్టర్ బాలు, నజియాషేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోరంకిలో నూతన వస్త్రాలు పంపిణీ



పెనమలూరు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోరంకిలో పేదలకు నూతన వస్త్రాలు సోమవారం పంపిణీ చేశారు. బేతెస్థ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బేతెస్థ ప్రార్థన మందిరంలో దైవసేవకుడు కృపారావు 40 మంది వితంతువులు, విద్యార్థినులకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం పేదలకు నూతన వస్త్రాలు బహూకరించి వారికి అండగా ఉంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ క్రిస్మస్ పండుగను ఆనందంతో చేసుకోవాలని తెలిపారు.

పెదపులిపాకలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయ రాజరాజేశ్వరి, శ్రీ విజయ సుందరేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

బాబా మందిరంలో మహాలింగార్చన



పెనమలూరు: పెనమలూరు గ్రామం శ్రీసత్య సాయిబాబా మందిరంలో మహాలింగార్చన సోమవారం జరిగింది. కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా సత్య సాయిబాబా మందిరంలో కృష్ణా జిల్లా వేదాధ్యయన సమన్వయకర్త బ్రహ్మశ్రీ పాతూరి జ్ఞానేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహాలింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా చేశారు. అనంతరం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ వి.మోహన్‌రావు, సభ్యులు లక్ష్మీప్రసన్న, రమణమ్మ, ఝాన్సీ, రమాకుమారి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇందుపల్లిలో అల్పాహారం పంపిణీ



ఉంగుటూరు: మిచౌంగ్ తుఫాన్ కారణంగా సోమవారం ఉదయం నుంచి మండలంలో పలు గ్రామాల్లో ఎడతెరపి లేకుండా చిరుజల్లులతో వర్షం కురుస్తోంది. రైతులు ధాన్యం తడవకుండా పరదాలతో భద్రపరచుకున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రజలకు ఇంటికే పరిమితమయ్యారు. ఈ క్రమంలో ఇందుపల్లి, లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రోడ్డు పక్కన ఉండే పేదలకు ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్డీ అమీర్‌బాషాలు అల్పాహారం పొట్లాలు పంపిణీ చేశారు. అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారు.

నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గన్నవరం: ప్రభుత్వ ఉత్తర్వులను దిక్కరిస్తూ సెలవు రోజున పాఠశాలను నడిపిన నారాయణ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రాజేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లా కలెక్టర్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారని తెలిపారు. అయినప్పటికీ స్థానిక విద్యానగర్‌లోని నారాయణ హైస్కూల్ యథావిధిగా నడిపినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను పాటించని నారాయణ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానంపై అవగాహన

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల జువాలజీ, జాతీయ సేవా పథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలోని డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రక్తదానం తోటి మానవుల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించి తోటివారి ప్రాణాలను కాపాడాలన్నారు.

10న అన్నాభిషేకం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. ఈ నెల 10న బహుళ త్రయోదశి సందర్భంగా అన్నాభిషేకం, మహామృత్యుంజయ సహిత రుద్రహోమం 12న చండీ హోమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పెనమలూరు: పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసనగర్‌కు చెందిన విరోదుల వరాలమ్మ(65) ఆదివారం పోరంకిలో బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవడంతో విజయవాడ పటమటలోని ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హేలపురి బాలోత్సవానికి మానవత సభ్యుల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హేలపురి బాలోత్సవం నిర్వహణకు మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సభ్యులు రూ. 32,500 విరాళాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో హేలపురి బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి ఆలపాటి నాగేశ్వరరావుకు సోమవారం ఈ మొత్తాన్ని అందించారు. మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు రూ.25వేలు అందించగా, విశ్రాంత ఎంఈవో గంటా సత్యనారాయణ రూ. 5వేలు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి రూ.2500 చొప్పున విరాళాలు అందించారు.

ఘనంగా నేవీ డే వేడుకలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో నేవీ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత నావికా దళంలో జరిగే కమ్యూనికేషన్స్ వ్యవస్థతో పాటు నౌక దళాలు శత్రువులను ఎదుర్కొనే విధానాలను తెలియజేస్తూ ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్లు నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. 8వ ఆంధ్రా నావెల్ యూనిట్ కమాండింగ్ అధికారి కెప్టెన్ ఆర్.శ్రీనివాసరావు హాజరై క్యాడెట్లు రూపొందించిన నమూనాలను పరిశీలించి, క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల, కళాశాల అధ్యాపకులు నమూనాలను పరిశీలించారు. కార్యక్రమాన్ని కళాశాల నావెల్ ఎన్‌సీసీ ఆఫీసర్ వెంకటేష్ పర్యవేక్షించారు.

శివగిరిపై కార్తిక పూజల సందడి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక శివగిరిపై భక్తుల సందడి నెలకొంది. కార్తిక సోమవారం కావడంతో తెల్లవారు జామునుంచే భక్తులు శివగిరికి విచ్చేసి దీపాలు వెలిగించారు. 36 అడుగుల పంచముఖ శివలింగం దగ్గర, ఏడు పడగల నాగ పుట్ట, నాగదేవత విగ్రహాల దగ్గర దీపాలు వెలిగించి శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. శివగిరి వ్యవస్థాపకుడు మల్లిఖార్జున శర్మ శివలింగానికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర లింగార్చన, రుద్రహోమం, ప్రదోషపూజ, శివ కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని శివలింగానికి పూజలు చేశారు.